ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

- నల్లగొండ ఆర్టీఓ చంద్రశేఖర్

వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ చంద్రశేఖర్

మర్రిగూడ, ఫిబ్రవరి 20 : వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నల్లగొండ ఆర్టీఓ చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని మాల్ రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వాహనాలకు ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, ఫిట్‌నెస్ వంటివి ఉండాలన్నారు. వాహన డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 14 వాహనాలను పట్టుకున్నామని, అందులో 8 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేని వాహనాలకు రూ.2లక్షల జరిమానా విధించినట్లు ఆర్టీఓ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

భోజన విరామంలో ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 20 : 3వ, 4వ తరగతి ఉద్యోగుల నియామకాలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం దేవరకొండలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో గంట పాటు సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు సీఐటీయూఈ నాయకులు కె.పర్వతరెడ్డి, లియాఫి నాయకులు నిరంజన్‌గౌడ్ సంఘీభావం ప్రకటించారు. సమ్మెలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.రాము చౌహాన్, నాయకులు చిలుకూరి పరమేశం, వల్లంల శ్రీనివాస్, ఆంజనేయులు, గుండగోని శ్రీనివాస్, వింజమూరి శ్రీనివాస్, ఎన్.రామకృష్ణ, గుణగంటి శేఖర్, విజయ్‌కుమార్, సంధ్యారాణి, విశ్రాంత ఉద్యోగులు రామరాజు, ఫహీమ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి శిక్షణలో ఆదర్శ ఉపాధ్యాయురాలి ప్రతిభ

ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు సీతల్

గుర్రంపోడ్, ఫిబ్రవరి 20: మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయురాలు విటలాని సీతల్ జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నిష్ఠా జాతీయ స్థాయి రిసోర్స్ పర్సన్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. విద్యలో సాంకేతికత, ఇంటరాక్టివ్ ఉపకారణాల ఉపయోగం, సైబర్ నేరాలు వలలో పడకుండా విద్యార్థులను రక్షించడం, అగ్యుమెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఎన్ అర్జైజింగ్ టెక్ట్ బుక్స్, విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించడం, సాంకేతిక మూల్యాంకన సాధనాలను రూపొందించడం, కాపీ రైట్ చట్టాలు, సోషల్ మీడియా వాడకం వంటి అంశాల్లో శిక్షణ నిర్వహించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో గురువారం నిర్వహించిన ముగింపు కార్యాక్రమంలో ఆమెకు ప్రశంసాపత్రం అందించారు. శిక్షణలో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయురాలు సీతల్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ జి.రాగిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 20 : ఆయిల్ పామ్ సాగుపై గురువారం గుడిపల్లి మండల కేంద్రంలో పంతాంజలి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌వో రవికుమార్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రారెడ్డి, రామలింగయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- అందుకు అనుగుణంగా ఏర్పాట్లు
- ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ వేదికపై కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 20 : జిల్లాలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ వెయ్యి మెగావాట్లకు చేరిందని, ఈ నెల 17న 1002 మెగా వాట్లుగా నమోదైందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూకీ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతున్నదన్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది కొత్తగా 20 వేల మంది వినియోగదారులు చేరడంతో మొత్తం వినియోగదారులు 8.24 లక్షలకు చేరినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం కింద సుమారు 2.37 లక్షల మంది గృహ వినియోగాదారులు లబ్ధి పొందుతున్నట్లు చెప్పారు. సమ్మర్ ప్లాన్‌లో భాగంగా జిల్లాలో అదనంగా 2,900 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంతకు ముందు వరకు హైదరాబాద్ నగరానికే పరిమితమైన విద్యుత్ కాల్ సెంటర్ 1912 సదుపాయాన్ని జిల్లాకు కూడా విస్తరించినట్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే పరిష్కరించేందుకు అంబులెన్స్ తరహా ఈఆర్‌టీ వాహనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు అధికారులకు, సిబ్బందికి సెలవులు మంజూరు చేయవద్దని ఆదేశించారు. అనంతరం బీట్ మార్కెట్‌లో జరుగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ఆయన కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఆయన వెంట డైరెక్టర్లు నరసింహులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి, జిల్లా నోడల్ అధికారి భిక్షపతి, సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రమోహన్, ఎస్ఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎంజీయూ పీజీ రెండో సెమిస్టర్ అల్మానాక్ విడుదల

రామగిరి, ఫిబ్రవరి 20 : ఎంజీయూ పీజీ రెండో సెమిస్టర్ అల్మానాక్‌ను విడుదల చేసినట్లు రిజిస్ట్రార్ అల్వాల రవి గురువారం ఒక ప్రకటనలో తెలపారు. మార్చి 13 నుంచి తరగతులు ప్రారంభమై ఆగస్టు 6న సెమిస్టర్ ముగుస్తుందని పేర్కొన్నారు. వర్సిటీ అనుబంధంగా ఉమ్మడి జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు దీనిని అనుసరించాలని కోరారు.

అమ్మనబోలు మాజీ సర్పంచ్‌కు ప్రముఖుల పరామర్శ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 20 : మండలంలోని అమ్మనబోలు మాజీ సర్పంచ్ బద్దం వరమ్మ మాతృమూర్తి కమలమ్మ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయము తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యా వారి ఇంటికి వెళ్లి కమలమ్మ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, నాయకులు యానాల అశోక్ రెడ్డి, కట్టంగూరు సత్తయ్య, కొమ్ముగిరి ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల అందజేత

శాలిగౌరారం, ఫిబ్రవరి 20 : మండలంలోని వల్లాల గ్రామ మోడల్ స్కూల్ విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం టై, బెల్ట్, బ్యాగులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి, ప్రిన్స్‌పాల్ కృష్ణమోహన్, సంధ్యారాణి, చిత్తలూరి సత్యనారాయణ, కేతేపల్లి శ్రీను పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు వార్నింగ్ నోటీస్

మర్రిగూడ, ఫిబ్రవరి 20 : స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఈ నెల 17న మోడల్ స్కూల్స్ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి వార్నింగ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. ప్రిన్సిపాల్ పనితీరు బాగా లేదని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో స్కూల్స్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్, మానిటరింగ్ అధికారులు ఈ నెల 12న పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించి స్టేట్ అడిషనల్ డైరెక్టర్‌కు నివేదిక అందించారు. దాంతో అడిషనల్ డైరెక్టర్ నోటీసు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అందులో హెచ్చరించారు.

మోడల్ స్కూల్లో హిందీ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు

త్రిపురారం, ఫిబ్రవరి 20: మండలంలోని కంపసాగర్ మోడల్‌స్కూల్లో ఖాళీగా ఉన్న టీజీటీ హిందీ ఉపాధ్యాయుడి పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. గంటల పద్ధతిలో పాఠాలు బోధించాల్సి ఉంటుందని, అర్హులైన వారు ఈనెల 22 సాయంత్రం 5గంటలలోపు మోడల్ స్కూల్‌లో దరఖాస్తులను అందించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి 24న డెమో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జువాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా లైఫ్ మెంబర్‌గా మల్లేశ్

నకిరేకల్, ఫిబ్రవరి 20 : నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన విద్యావేత్త, పరిశోధకుడు డాక్టర్ మోదాల మల్లేశ్ జువాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా లైఫ్ మెంబర్‌గా ఎంపికయ్యాడు. జంతుశాస్త్ర పరిశోధనల్లో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఆ గౌరవం లభించింది. డాక్టర్ మల్లేశ్ పత్తి పంటలపై కీటకాల వైవిధ్యంపై, మొక్కజొన్న, మినప పంటల్లోని కీటకాలపై విస్తృతంగా పరిశోధనలు చేశారు. ఆయన తన పరిశోధనల ద్వారా వ్యవసాయంలో సుస్థిరత, పంటల పరిరక్షణకు చేస్తున్న కృషికి గానూ జువాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా గుర్తింపును ఇచ్చింది. డాక్టర్ మల్లేశ్ ప్రస్తుతం నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ

నిడమనూరు, ఫిబ్రవరి 20 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అయితే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు నిడమనూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుంటుకగూడెం గ్రామానికి చెందిన గోపిశెట్టి శ్రీనయ్య(57) జనవరి 2న నర్సింహులగూడెం-ముప్పారం రోడ్డులో మూల మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వడ్డెరిగూడెం గ్రామానికి చెందిన గోగుల మహేశ్‌ను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. మృతదేహంతో మూడు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. ఎస్ఐ గోపాల్‌రావు వారితో మాట్లాడినా ఆందోళన విరమించలేదు. విషయం తెలుసుకున్న హాలియా సీఐ జనార్దన్‌గౌడ్ అక్కడికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన మహేశ్‌ను శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు రప్పించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. కార్యక్రమంలో గుంటుకగూడెం మాజీ సర్పంచ్ గుడిసె శంకరయ్య, అక్కి శ్రీనివాస్, తిరుపతి రావు, చామల యాదగిరిరెడ్డి, సంకూరి రాంబాబు, రవి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

కుక్కల దాడిలో గాయపడిన జింక

మర్రిగూడ, ఫిబ్రవరి 20 : మండలంలోని దామెర భీమనపల్లిలో గురువారం పొలాల్లోకి వచ్చిన జింకపై వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. రైతుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ శిలువేరు విష్ణు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు గాయపడ్డ జింకను మండల కేంద్రంలోని పశువుల దవఖానకు తరలించారు. డాక్టర్ సురేందర్ జింకకు వైద్యం అందించారు. జింక ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఆయన తెలిపారు.

శ్రీనివాస్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 20 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి ఆశయాలను సాధించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎన్ఎస్ఆర్ 6వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ ఎన్ఎస్ఆర్ నిత్యం పీడిత ప్రజల కోసం పనిచేశారని, సంపన్న వర్గంలో పుట్టి పేద ప్రజల కోసం ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, పోలెబోయిన వరలక్ష్మి, వినోద్‌నాయక్, గాదె పద్మ, బావండ్ల పాండు, తిరుపతి రామ్మూర్తి, కోటిరెడ్డి, ఊర్మిల, అరుణ, గోవర్ధని, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఏవీఎం విద్యార్థి ఎంపిక

విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఫిబ్రవరి 20 : జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన పట్టణంలోని ఏవీఎం పాఠశాల విద్యార్థి జటావత్ కృష్ణుడును గురువారం ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించి నకిరేకల్‌కు జాతీయస్థాయిలో పేరు తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కందాల స్వప్న, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మల శంకర్‌గౌడ్, జితేందరెడ్డి, ఉపేందర్, పాల్గొన్నారు.

భారత ఆహార సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ మేనేజర్ ప్రసాద్

రామగిరి, ఫిబ్రవరి 20: భాతర ఆహర సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎఫ్‌సీఐ నుంచి కలెక్టరేట్ వరకు స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆ సంస్థ జిల్లా మేనేజర్ కేఎస్‌కే ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ అధికారులు బిల్లా శ్రీనివాసరావు, సతీశ్, పవన్, కాసిరెడ్డి, ఆదిమల్ల శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పులిచర్ల విద్యార్థిని

పెద్దవూర, ఫిబ్రవరి 20 : మండలంలోని పులిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గుండాల నిహారక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మురళి తెలిపారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నిహారికను పాఠశాల హెచ్‌ఎం సుదర్శన్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో నిహారిక పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

పశు వైద్యుడిని నియమించాలని రైతుల నిరసన

పశువైద్య కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిట్యాల, ఫిబ్రవరి 20 : మండలంలోని పెద్దకాపర్తి పశు ఆరోగ్య ఉపకేంద్రానికి వైద్యుడిని నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతులు కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపకేంద్రం పశు వైద్యుడు కొన్ని నెలలుగా విధులకు హాజరు కాకపోవటంతో పశువులకు వైద్యం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఉపకేంద్రానికి పశు వైద్యుడు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చూకూరి గణేశ్, రైతులు పాల్గొన్నారు.

మహిళ లకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం

కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మోహన్‌రెడ్డి

నకిరేకల్, ఫిబ్రవరి 20 : పీఎంజేఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు, లయన్ గోలి అమరేందర్‌రెడ్డి సహకారంతో నకిరేకల్ నవ్యక్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని గురువారం ట్రస్ట్ వ్యవస్థాప అధ్యక్షులు వై. మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగాలని కోరారు. శిక్షణ రెండు నెలల కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎన్. రామ్మోహన్‌రావు, సెక్రటరీ వై. యాదగిరిరెడ్డి, కోశాధికారి కందాల లక్ష్మీనారాయణరెడ్డి, లయన్స్ చార్టర్ ప్రెసిడెంట్ కె.పాపిరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

నాంపల్లిలో సంత్ సేవాలాల్ జయంతి

వేడుకల్లో పాల్గొన్న అధికారులు, బంజారా నాయకులు

మర్రిగూడ(నాంపల్లి), ఫిబ్రవరి 20 : నాంపల్లి మండల కేంద్రంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం అధికారులు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన గిరిజనులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన సాంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామ్‌చందర్‌నాయక్, తాసీల్దార్లు గుగులోత్ దేవాసింగ్, బక్క శ్రీనివాసులు, రాములు, కృష్ణ, దశరథ, నరేందర్‌రెడ్డి, గిరిజన సంఘం నాయకులు, కుల పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి

- ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 20: రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జనాభా నిష్పతి ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించాలని, సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని, బీసీ సబ్ ప్లాన్ రూపొందించాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 12న ఎంసీపీఐయూ వ్యవస్థాపకుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మద్దికాయల ఓంకార్ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 28న అన్ని మండలాల తాసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, కమిటీ సభ్యులు పోతుగంటి కాశీ పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్య, ఆహార నియమాలు పాటించాలి

- సీడీపీఓ చంద్రకళ

కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ చంద్రకళ, అధికారులు

దామరచర్ల, ఫిబ్రవరి 20: కిశోర బాలికలు ఆరోగ్య, ఆహార భద్రతా నియమాలు పాటించాలని సీడీపీఓ చంద్రకళ సూచించారు. మండలంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో గురువారం నిర్వహించిన బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో రుతుక్రమంపై బాలికలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు రుతుక్రమం సమయంలో అనుసరించాల్సిన విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, వైద్యాధికారి నసీమాబేగం, గురుకుల ప్రిన్సిపాల్ స్వరూప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హరితహారం చెట్లను నరికిన వారిపై కేసు నమోదు

చెట్లను తొలగించిన విషయాన్ని వెలుగుకి తెచ్చిన నమస్తే తెలంగాణ

మర్రిగూడ, ఫిబ్రవరి 20 : మండలంలోని వట్టిపల్లిలో సర్వే నంబర్ 372లో 3.13ఎకరాల రామలింగేశ్వరస్వామి ఆలయ భూమిలో పెంచిన హరితహారం చెట్లను నరికిన వారిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. హరితహారం చెట్లను యంత్రం సాయంతో తొలగించిన విషయమై ఈ నెల10న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'పచ్చని చెట్లు పేకేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. అయితే రాజకీయ ఒత్తిళ్లు, నాటకీయ పరిణామాల మధ్య ఆలస్యంగా స్పందించిన అధికారులు చెట్లు నరికిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రికెట్ ఆట ఆడుకోవడానికి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గత నెల 29న హరితహారం చెట్లను తొలగించి గ్రౌండ్‌ను తయారు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

మాట్లాడుతున్న ఎస్ఐ వీరబాబు

పెద్దవూర, ఫిబ్రవరి 20 : విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల బారిన పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ వీరబాబు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, కష్టపడి చదివి ఉన్నతస్థానాన్ని అధిరోహించాలని సూచించారు. అనంతరం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, ఆపరేషన్ స్మైల్, మానవ అక్రమ రవాణా, సోషల్ మీడియా, బాల్య వివాహాలు వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ది నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి. నల్లగొండ
బ్రాంచి: గుర్రంపోడు

వ్యవసాయ భూముల బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా గుర్రంపోడ్ సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! ది.నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి. గుర్రంపోడు బ్రాంచి మండలము గుర్రంపోడు మండలం నుండి భూమి అభివృద్ధి కొరకు మార్టగేజ్ ఋణమును పొంది ఋణమును చెల్లించనందున బకాయిదారుడు కావడం జరిగినది. అట్టి ఋణము బాపతు బకాయి వసూలు చేయుటకు ఈ క్రింది బాకీదారునకు సంబంధించి బ్యాంకునకు తాకట్టుపెట్టబడిన స్థిరాస్తి (భూమి) బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును వేలము వేయబడు భూముల వివరములు తేది మరియు ప్రదేశము ఈ క్రింద తెలుపబడినది. వేలములో పాల్గొను వ్యక్తులకు వేలము నియమ నిబంధనలకు కట్టుబడి వేలములో పాల్గొనవచ్చును.

క్ర.సం	బకాయిదారుని పేరు మరియు తండ్రి పేరు	సర్వే నెంబర్	విస్తీర్ణం ఎ.గు	భూమి ఉన్న శివారు గ్రామం	వేలం వేయు తేది & సమయం	వేలం వేయు ప్రదేశము
1	శ్రీ కామళ్ళ సీతారాములు తండ్రి: లచ్చయ్య, గ్రా॥బొల్లారం, మం॥గుర్రంపోడ్, జి॥నల్లగొండ (EP No.453/2023)	28/అ5 33/అ1	4.14 0.06	గ్రా॥ చేపూరు	24-02-2025 ఉ॥11-00 గం॥లకు	గ్రామ పంచాయితీ బిల్డింగ్ బొల్లారం
		Total	4.20			

వేలము నియమ నిబంధనలు
1. వేలము వేయబడు భూములు బ్యాంకు వారికి తాకట్టు పెట్టబడినందున జప్తు చేయబడి వేలము వేయబడుచున్నది.
2. వేలములో పాల్గొను వ్యక్తి వేలమునకు ముందుగా రూ॥25,000/- (అక్షరాల రూపాయలు ఇరువది ఐదువేలు) డిపాజిట్ (ఇ.ఎం.డి) సేల్ ఆఫీసర్ వద్ద డిపాజిట్ చేసి వేలములో పాల్గొనవచ్చును.
3. వేలము సరైన ధర వచ్చినట్లు భావించిన వేలము అత్యధిక పాటదారుని పేరున వేలము ఖరారు చేయబడును.
4. అత్యధిక పాటదారు వేలము విలువ 15% వేలము ముగిసిన వెంటనే చెల్లించవలయును. మిగతా 85% మరియు స్టాంపు డ్యూటీ ఫౌండేజి చార్జీలను కూడా వేలము తేది నుండి (15) దినములలోగా పూర్తిగా చెల్లించవలయును. లేనిచో చెల్లించిన సొమ్ము తిరిగి ఇవ్వబడదు. జప్తు చేసుకోబడును.
5. ఎట్టి పరిస్థితిలో కూడా (15) దినములకు మించి సమయం ఇవ్వబడదు.
6. వేలములో ఒక వ్యక్తికి మించి పాల్గొనదలచినచో అట్టి వ్యక్తులు ఉమ్మడిగా వేలములో పాల్గొనుచున్నట్లు అందరి తరపునొక వ్యక్తికి అధికారమిస్తూ అఫిడవిట్ ఇవ్వవలయును. అట్టి అఫిడవిట్ రూ॥50/-ల స్టాంపు పేపరుపై ఇవ్వాలి.
7. వేలములో పాల్గొను వ్యక్తులు వేలము నియమ నిబంధనలకు కట్టుబడి ఉన్నట్లు వేలమునకు ముందు నిర్ణీత ఫారంలో అంగీకారం ఇవ్వవలయును.
8. వేలములో పాల్గొను వ్యక్తులు ప్రకటించబడిన భూములను స్వయముగా సందర్శించి, తృప్తిపడి అన్ని విషయములు తెలుసుకొని వేలములో పాల్గొనునట్లుగా భావించబడును.
9. సదరు భూములకు రహదారుల విషయములో ఏ విధమైన హామీలు బ్యాంకు తరుపున ఉండవు. స్థానికంగా ఉన్న వనరులే అంతిమం.
10. కొనుగోలుదారుడు పూర్తి డబ్బు చెల్లించి భూమి మార్పిడి చేసుకొను వరకు అట్టి భూమిపై ఏ విధమైన హక్కు ఉండదు.
11. వేలము వేయబడు భూమి విషయములో ఏ విధమైన అభ్యంతరములు వచ్చినను అవి పరిష్కరించు ఉత్తర్వులు జారీ చేసిన పిదప వేలము ఖరారు చేయబడును.
12. వేలము వేయబడు భూములు ఏక మొత్తముగా గాని విడివిడిగా గాని విక్రయించుటకు సేల్ ఆఫీసర్‌కు పూర్తిఅధికారం కలదు. ఎట్టి కారణములు చూపకుండగా వేలము వాయిదా వేయుటకు గాని రద్దు చేయుటకు గాని అధికారం కలదు. (JR/OSD, N.D.C.C. Bank Ltd. Nalgonda ఉత్తర్వుల ప్రకారం).
13. ఇతర వివరములకుసేల్ ఆఫీసర్ గారిని గాని, డిప్యూటీ రిజిస్ట్రార్/ఓ.ఎస్.డి. గారిని గాని సంప్రదించవచ్చును.

సేల్ ఆఫీసర్, యన్.డి.సి.సి. బ్యాంకు లి. నల్లగొండ
బ్రాంచి: గుర్రంపోడ్
సెల్ నెంబర్: 95424 45336

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

డాక్యుమెంట్ పోయినది
గణపురం పార్వతమ్మ, W/o. (లేట్) గణపురం కృష్ణ, R/o. P.A.పల్లి గ్రామం, మండలం నల్లగొండ జిల్లా అను నాయొక్క నా భర్త లేట్ గణపురం కృష్ణ పేరునగల Open Plot No.3/2 in part డాక్యుమెంట్ No.5203/2021 పోయినది దొరికిన వారు సంప్ర:9848775792.

CHANGE OF NAME
★I, DEVA DAS MUDI, R/o. 12-173, Christain Colony, Devarakonda, Nalgonda Dist-508 248, TS. Changed My Name to SHELMON DEVADAS MUDI, S/o. Devadas Shelmon Mudi.
NT-329808

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
(గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638